వేదాంతభేరి

ఆగస్టు 2020

రూ. 10/-

వేదాంతభేరి

ఆగస్టు 2020

రూ. 10/-

మోక్షసాధనలలో మొట్టమొదటిది వైరాగ్యము.

మనస్సును బాహ్యమునుండి మరల్చి అంతర్ముఖము చేయుటకు వైరాగ్యమునకు మించిన సాధనోపాయము వేఱొకటి లేదు. వైరాగ్యముచేతను, అభ్యాసముచేతను మనస్సు యొక్క నిలకడ సాధింప వచ్చును. మనస్సు నిలకడ లేనిచో శాంతి ఎవరికిని లభించదు.

వస్తువునందలి దోషమును తెలిసికొని ఆ వస్తువుయెడల మమత్వము విడనాడుటయే వైరాగ్యము.

దృశ్యవస్తువునందుగల నశ్వరత్వము, క్షణికత్వము అను దోషములను తెలిసికొని మనుజుడు వానిపై ఎగబడక శాశ్వత ఆత్మకొఱకే అన్వేషించుట శ్రేయస్కరము.

– శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు: శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 ఆగష్టు 2020 సంచిక : 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 ఆగష్టు 2020 సంచిక : 08

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టవలెను
- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 13

04. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 15

05. మృత్యోర్ముక్షీయ మా మృతాత్-శ్రీసర్వాత్మానందగిరిస్వాములవారు -20

06. భయంకర సూక్ష్మజీవులు- డా॥ సముద్రాల లక్ష్మణయ్య -25

07. ఉద్ధవగీత- శ్రీ యేలేశ్వరపు హనుమరామకృష్ణ - 33

08. అహంకారము - కె. ఈశ్వర్ - 36

09. వేదాంతసారము - సదానంద యోగీంద్రులు - 37

10. వార్తలు - 42

ముఖచిత్రం

చిటికెన వ్రేలుపై గోవర్ధనగిరి నెత్తిన శ్రీకృష్ణుడు

11-08-2020 శ్రీకృష్ణాష్టమి

15-08-2020 స్వాతంత్ర్యదినోత్సవము

15-08-2020 అరవిందయోగి జన్మదినోత్సవము

22-08-2020 వినాయకచవితి , 31-08-2020 ఓనం పండగ

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం భజే వ్రజైకమణ్డనం సమస్త పాపఖణ్డనం
స్వభక్త చిత్తరఞ్జనం సదైవ నన్దనన్దనమ్ ।
సుపిచ్ఛగుచ్ఛమస్తకం సునాదవేణుహస్తకం
అనఙ్గరఙ్గసాగరం నమామికృష్ణనాగరమ్ ॥

2. ఓం మనోజగర్వమోచనం విశాలలోలలోచనం
విధూత గోపశోచనం నమామి పద్మలోచనమ్ ।
కరారవిన్ద భూధరం స్మితావలోకసున్దరం
మహేన్ద్రమానధారణం నమామి కృష్ణవారణమ్ ॥

3. ఓం కదమ్బసూనకుణ్డలం సుచారుగణ్డమణ్డలం
వ్రజాఙ్గనైకవల్లభం నమామి కృష్ణదుర్లభమ్ ।
యశోదయా సమోదయా సగోపయా సనన్దయా
యుతం సుఖైకదాయకం నమామి గోపనాయకమ్ ॥

4. ఓం సదైవ పాదపఙ్కజం మదీయమానసే నిజం
దధానముత్తమాలకం నమామి నన్దబాలకమ్ ।
సమస్త దోషశోషణం సమస్త లోకపోషణం
సమస్త గోపమానసం నమామి నన్దలాలసమ్ ॥

5. ఓం భువో భరావతారకం భవాబ్ధికర్ణధారకం
యశోమతీకిశోరకం నమామి చిత్తచోరకమ్ ।
దృగన్తకాన్త భఙ్గినం సదాసదాలసఙ్గినం
దినే దినే నవం నవం నమామి నన్దసమ్భవమ్

6. ఓం నమో నమః క్లేశ వినాశనాయ
నిరూపితోదార గుణాహ్వయాయ ।
మనోవచో వేగ పురోజవాయ
సర్వాక్షమార్గైరగతాధ్వనే నమః ॥

గాలి ఉన్నపుడే తూర్పారబట్టవలెను

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఏ వస్తువైనను ఉన్నపుడు దానివిలువ తెలియదు. కంటియొక్క విలువ కండ్లున్నపుడు అంతగా తెలియదు. గ్రుడ్డివాడు నేత్రముల యొక్క విలువను చక్కగా అంచనా వేయగడలదు. చేతులవలనను, కాళ్ళవలనను జనులు ఎంత లాభమును పొందుచున్నారో అవి చక్కగా నున్నప్పుడు తెలియదు. వానికి వైకల్యము సిద్ధించినపుడు తెలియును. ఆరోగ్యము యొక్క విలువ అనారోగ్యము కలిగినపుడు బాగుగ తెలియగలదు. సూర్యునియొక్క విలువ పగలు గుర్తెఱుంగువారు చాల అరుదు. రాత్రి చీకటిలో అవస్థపుడనపుడు ఆ సూర్యుడు లోకమున కెంత ఉపకారము చేయుచున్నాడో చక్కగా అనుభూతమగుచుండును. అట్లే శరీరమున్నపుడు దాని విలువ యెంతటిదో మనుజుడు గ్రహించుట లేదు. అది పోయిన పిదప బాధ నొందుచున్నాడు. ఎన్నియో జన్మలు దాటి సుకృతవశమున మానవుడై పుట్టుచున్నాడు జీవుడు.

'కదాచిల్లభతే జన్తుర్మానుష్యం పుణ్యసంచయాత్' అని గరుడ పురాణమున విష్ణుభగవానుడీ విషయమునే గరుత్మంతునకు తెలిపి యుండిరి. కావున మానవజన్మ దుర్లభము, కాదు సుదుర్లభమనియే చెప్పవలసియున్నది. అది మోక్షమునకు సోపానము వంటిది. పూర్వము సృష్ట్యాదియందు చతురాననుడు (బ్రహ్మ) వృక్షములను, సరీసృపములను, పశువులను, పక్షులను, మత్స్యాదులను సృజించియు వానిచే ఏ మాత్రము సంతుష్టిని బొందక యుండెను. కాని తదుపరి మనుజుని సృష్టించి పరమానందభరితుడయ్యెనట! ఏల? బ్రహ్మావలోకమునకు కావలసిన

బుద్ధి బలము మానవునకు మాత్రమే కలదు. తక్కిన జీవరాసుల కదిలేదు. ఆ బుద్ధి బలమును సదుపయోగమొనర్చుకొని పరమార్థలక్ష్యప్రాప్తి యందద్దానిని వినియోగించినపుడు మాత్రమే అది సఫలమగును. లేనిచో, అదియున్నను లేనిదానితో సమానమే యగును. కాని మనుజుడట్లు చేయుచున్నాడా ? మోక్షసౌధారోహణమునకు భగవానుడొసంగిన ఈ చక్కని సోపానమును మనుజుడు సదుపయోగ మొనర్చుకొనుచున్నాడా ? 'హరి' ద్వారమును జేరుటకు యత్నించుచున్నాడా? లేదు 'అరి' ద్వారమునే తట్టుచున్నాడు. దేవునికొఱకు దేహమును వినియోగించుచున్నాడా? లేదు. ఈ ప్రకారముగ అమూల్యమగు సదవకాశమును భ్రష్టమొనర్చుకొని విషయవ్యామోహాయుక్తుడై ఉన్నత శిఖరములనుండి క్రమక్రమముగ దిగజారిపోవుచున్నాడు. చిన్మయుడుగా వెలుగొందవలసియున్న యాతడు మృణ్మయుడుగ తయారగుచున్నాడు. ఇది చాల శోచనీయము. అతని అజ్ఞానస్థితిని పెద్దలెంత చక్కగ వర్ణించియున్నారో చూడుడు...

స్థాల్యాం వైదూర్యమయ్యాం పచతి తిలఖలం చాందనైరింధనౌఘైః
సౌవర్ణై లాఙ్గలాగ్రైః విలిఖతి వసుధామర్కతూలస్య హేతోః ।
ఛిత్త్వా కర్పూరఖండాన్ వృతిమివ కురుతే కోద్రవాణాం సమన్తాత్
ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి పురుషో యస్తపో మందభాగ్యః ॥

'వజ్రవైదూర్యములతో పొదగబడిన పాత్రయందు తెలకపిండిని వుంచి చందనపు కట్టెలతో దానినివండుచున్నాడు ! జిల్లేడు చెట్లు నాటుట కొఱకు బంగారపు నాగలితో పొలమును దున్నుచున్నాడు! ఆరిక పైరును సంరక్షించుట కొఱకు అరటి మొక్కను నటికి పొలము చుట్టు నాటుచున్నాడు! అట్లే కర్మ భూమియగు భూలోకమున జన్మించియు ఎవడు తపస్సు నాచరింపడో,

నైవమును సాక్షాత్కరించుకొనుటకు యత్నింపడో, ఉత్తమమగు ఈమానవ శరీరమును తుచ్ఛవిషయ భోగానుభవమునందును, నశ్వర ప్రాపంచిక వస్తు సంపాదనమునందును మాత్రము వినియోగించునో, అట్టివాడు మందభాగ్యుడే యగును!' అని మహనీయులు హెచ్చరిక చేయుచున్నారు.

కాబట్టి భగవానుడు కరుణించి మానవ దేహమను చక్కని ఉపకరణమును మన కొసంగినపుడు అది శిథిలము కాక పూర్వమే దాని వలన ఎంత పారమార్థిక లాభమును పొందగలుగుదుమో అంత పొందియే తీరవలెను. ఇట్టి మహదవకాశములు మఱి ఏ యితర లోకమునను, ఏ యితర జన్మయందును గూడ లభించవు. **గాలి వున్నప్పుడే తూర్పారబట్టవలెను. దీపమున్నపుడే ఇల్లు చక్క పెట్టుకొనవలయును.**

Strike the iron when it is hot. 'ఇనుము వేడిగా నున్నపుడే దానిని సాగదీయవలెను' చల్లబడినచో వీలుపడదు. కావున దేహము యొక్క విలువను దేహమున్నపుడే బాగుగ తెలిసికొని దానిచే చక్కటి సాధనము గావించి చెఱకునుండి రసమును గ్రహించునట్లును పాల నుండి వెన్నను బడయునట్లును పంచకోశాంతర్గతమగు పరమాత్మను సాక్షా త్కరించుకొనవలెను.

ఏలయనగా, జీవితము క్షణభంగురమైనది. ఎత్తైన చెట్టుకొమ్మ యొక్క చివరిభాగమునగల ఆకుకొనయందు వ్రేలాడుమంచుబొట్టువలె శరీరము ఏక్షణమున కా క్షణము రాలుటకు సిద్ధముగ నున్నది. ఆయువును కొందఱు ఏనుగు చెవులతో పోల్చిరి.కావున ఆరోగ్యము, ఇంద్రియ సౌష్ఠవము, సదవకాశములు ఉన్నపుడే సాధన తీవ్రముగ ఆచరించవలెను. వార్ధక్యములో జ్ఞాపకశక్తి తగ్గిపోవును, ఇంద్రియములు సడలిపోవును. శక్తి క్షీణముఖము పట్టును. అట్టితఱి తీవ్రసాధన లొనర్చుటకు అనుకూల్యత

ఏర్పడదు. కాబట్టి....

'గృహీత ఇవకేశేషు మృత్యునా ధర్మమాచరేత్' అని పెద్దలు చెప్పినట్లు ....మృత్యువు జుట్టుపట్టుకొని యున్నట్లు భావించి, ధర్మము నాచరించవలెను. శ్రీశంకరాచార్యులవారు భగవంతుని గూర్చి ఈ ప్రకారముగ ప్రార్థించిరి.

1). రోగా ఘదన్తి సతతం ప్రబలాశ్శరీరం
కామాదయో ౽ ప్యనుదినం ప్రదహన్తి చిత్తమ్ ।
మృత్యుశ్చ నృత్యతి సదా కలయన్ దినాని
తస్మాత్త్వ మద్య శరణం మమ దీనబన్ధో ॥

2). ఆయుర్వినశ్యతి యథామఘటస్థతోయం
విద్యుత్ప్రభేవ చపలా నవయౌవనశ్రీః ।
వృద్ధా ప్రధావతి యథా మృతరాజపత్నీ
తస్మాత్త్వమద్య శరణం మమ దీనబన్ధో. ॥

1). ఓ దీనబంధూ ! భయంకరములైన రోగములు శరీరమును నిరంతరము సతమతము చేయుచున్నవి. కామ క్రోధాదులు చిత్తమును దహించివేయు చున్నవి. మృత్యువు నాట్యము సలుపుచు రోజులు లెక్క పెట్టుచున్నది. కాబట్టి ఇపుడు నీవే నాకు శరణ్యము."

2). పచ్చికుండలోని నీటివలె ఆయువు నశించిపోవుచున్నది. నూతన యౌవనశోభ మెఱపువలె చంచలముగా నున్నది. వార్ధక్యము ఆడసింహము వలె పరుగిడి వచ్చుచున్నది. కావున ఇపుడు "నీవే నాకు శరణ్యము!" శ్రీశంకరుల ఈ వాక్యములు వాస్తవికతను ప్రతిబింబింపచేయుచున్నవి.

ప్రతిజీవియు 'మృత్యు సంసారము'న తగుల్కొని యున్నాడు. కావున దాని నుండి తప్పించుకొను తెఅవు యోచించుకొనియే తీరవలెను. తానీ ప్రపంచమున ఎన్ని భోగభాగ్యముల ననుభవించినను, మహో వైభవములను కండ్లజూచినను. అవియన్నియు బంధన మధ్యమున తానను భవించునవి యగును. కాబట్టి విషయ విరక్తి గలిగి, భక్తి జ్ఞాన వైరాగ్యాది ముక్తి సాధనలను త్వరితముగ నాచరించి తరించవలెను.

'ఉత్తిష్ఠత జాగ్రత!' అని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. మేలుకొనుడు! అని మహనీయులు ఉద్ఘోషించుచున్నారు. జన్మ జన్మాంతరము అజ్ఞాన తమస్సునబడి నానాయాతనలు జెందుచు మత్తుగ కాలము గడుపు చున్న జీవరాసులను గూర్చి మహాత్ములివ్విధముగ హెచ్చరిక చేయుచున్నారు. కావున వారి యా వాక్యములను శ్రద్ధతో నాలకించి (మోహ) నిద్ర నుండి లేచి మత్తును పారద్రోలి, సద్గురువుల సన్నిధికేగి ముక్తి మార్గములను వెతకుకొనవలెను. శాశ్వత శాంతికై ఉపాయములను అన్వేషించవలెను.

మోక్షాధీశుడగు పరమేశ్వరుని శరణుబొందుటయే శాంతి సుఖములను బడయుటకు ఏకైక మార్గము, ఈ మార్గము నవలంబించియే యెందఱో మహనీయులు పూర్వము తరించియుండిరి, తరించుచున్నారు, తరింపగలరు. అనంతానంద మొసంగునట్టి పరమేశ్వరుని జనులేల శరణు బొందరాదు? క్షణిక భోగ విలాసములందు జీవితములను ధారపోయనేల? ఎంతయో పుణ్యమను డబ్బును వెచ్చించి ఈ మానవ శరీరమను నౌకను జీవుడు కొనియున్నాడు. నౌక ఎల్లకాలము చక్కని స్థితిలో నుండునా? ఉండదు.కొంత కాలమునకు చిల్లులు పడును. శైథిల్యము నొందును. అట్లు కాక పూర్వమే సంసార సముద్రమును దాటి వేయవలెను. నావ చక్కని స్థితిలో నున్నపుడే నావికుడు జాగరూకుడై దాటవలసిన జలమును

దాటివేయవలసియున్నాడు.

మహతా పుణ్య పణ్యేన క్రీతే ఽయం కాయనౌస్త్వయా ।

పారం దుఃఖోదధేర్గన్తుం తరయావన్నభిద్యతే ॥

మహత్తర పుణ్యమను ఖరీదు చెల్లించి కొనినటువంటి ఈ మానవ దేహము శిథిలము కాక పూర్వమే సంసారమను దుఃఖసాగరమును జీవుడు తరించవలెను. బాల్యము అతి త్వరితముగ దాటిపోయి యౌవన మేతెంచుచున్నది. "ఆహా! యౌవన వైభవమెంత ఆహ్లాదముగ నున్నది!" అని అనుకొనుచుండగనే శరీరము ముడుతలు పడనారంభించుచున్నది జుట్టు తెల్లబడుచున్నది, పండ్లు ఊడుచున్నవి. చూపు తగ్గుచున్నది. వ్యాధులు బాధించుచున్నవి. క్రమముగ వార్ధక్యము జొరబడి తాను ముందుపోవుచు "ఓయీ! మృత్యువా! ఇక నీవు వెనుక రావచ్చును" అని అంతకుని ఆహ్వానించుచున్నది. ఈ సన్నివేశమునే విష్ణుభగవానుడు పూర్వము గరుత్మంతునకు ఈ ప్రకారముగ చక్కగా వర్ణించి చెప్పెను.

జరా దర్శితపన్థానం ప్రచండ వ్యాధి సైనికమ్ ।

మృత్యు శత్రురధిష్ఠో సి త్రాతారం కిం న పశ్యసి (గరుడపురాణము)

"వార్ధక్యము దారి చూపుచుండ భయంకర రోగములను సైనికులతో గూడి మృత్యువను శత్రువు మీదికి దండెత్తి వచ్చుచున్నాడు. రక్షించువాని కొఱకు ఏల ప్రయత్నించుటలేదు? "

కావున అశాంతికరమగు ఈసంసార వాతావరణంలో పడియున్న జీవుడు భగవచ్ఛరణాగతి ద్వారా, ఆత్మానాత్మవివేచన ద్వారా శాంతికి మార్గమును అతిశీఘ్రముగ వెతకవలసియున్నది. భావికాల శ్రేయస్సును గూర్చి యోచించవలసియున్నది. వర్తమాన కాలమును మాత్రము

చూచునది పశువు. భూత భవిష్యత్తులను గూడ చూచువాడు మానవుడు.

ఎన్నియో జన్మలు ఇప్పటికి గడచినవి. అజాగ్రత్తగ నున్నచో ఇంకను ఎన్నియో జన్మలు రానున్నవి. ఈ అనంత జీవితము ఒక పెద్ద గొలుసు వలె నున్నది. ఒక్కొక్క జన్మ ఒక్కొక్క రింగు వంటిది. వెనుకటి జన్మలు దాటిపోయినవి. కావున వానిని మన మేమియు చేయజాలము. రానున్న జన్మలు మాత్రము ఇపుడు మన చేతిలో నున్నవి. వానిని అంత మొనర్చుటకు తగిన శక్తి సామర్థ్యములు మానవునకు కలవు. శమదమాది సాధన సంపత్తిని అలవఱచుకొని వైరాగ్యము, భక్తి మొదలగు దైవగుణములను పెంపొందించుకొని క్రమముగ జ్ఞానాగ్నిని రగుల్కొలిపినచో 'కర్మ' కట్టెలన్నియు దగ్ధములు కాగా ఇక భవిష్య జ్జన్మలకు పూర్ణ విరామము ఏర్పడి జన్మరాహిత్యము సిద్ధింపగలదు. కావున శరీరము ఆరోగ్యముగనున్నపుడే, వార్ధక్యము రాక పూర్వమే, ఇంద్రియముల శక్తి క్షీణించక మునుపే, ఆయస్సు క్షయించక ముందే తన శ్రేయస్సును గుఱించి తాను బాగుగ యోచించుకొనవలెను. అట్లుకాక 'ఇప్పుడేమి తొందఱ. ఇంకను పిల్లలకు వివాహమే కాలేదు, వారి చదువులు పూర్తి కాలేదు, వారికి ఉద్యోగములు రాలేదు నేనింకను "రిటైర్" కాలేదు." అని ఈ ప్రకారముగ పరమాత్మ ధ్యానమునకు మీనమేషములు లెక్కించుకొనుచుండినచో మహా ప్రమాదము ఘటిల్లగలదు.

కావున విజ్ఞుడగువాడు బాగుగ యోచించి అమూల్యమగు ఈ మానవ జీవితమును భోగములందుగాక యోగమునందే వినియోగించి గురూపదిష్ట మార్గము ద్వారా ఆత్మజ్ఞానమును శీఘ్రముగ సంపాదించి జన్మసాఫల్యమును బొందవలెను. భగవంతుని పాదపద్మములను ఆశ్రయించి భవరోగమును బాపుకొనవలెను.

సద్గురు బోధ

- శ్రీ మలయాళస్వాములవారు

1. ఒక చెవితో ఉపనిషచ్ఛ్రుతిపాద్య బ్రహ్మమును వినుటయు, రెండవ కర్ణముతో దీనుల దుఃఖాలాప మొఱను విని తన్నివృత్తికొరకు ప్రయత్నించుటయు, ఒక దృష్టితో బ్రహ్మము ననవరతము దర్శించుటయు, రెండవ నయనముతో జనుల తపనమును అవలోకనము చేయుటయు, ఒక చేతితో ఇహపర ధనముల నార్జించుటయు, రెండవ కరముతో లోకమున కిచ్చుటకు ఆతుర పడుటయు, ఒక పాదముతో జ్ఞాన విజ్ఞానముల నార్జించుటకు, తిరుగుటయు, రెండవ చరణముతో దానిని భక్తులకిచ్చుటకు పరుగెత్తుటయే యథార్థమైన తపస్సనియు, ఋషి మతమనియు, సనాతన ధర్మమనియు మరువకుడు.

2. మనస్సును యెల్లప్పుడు ఒకే నిర్మల స్థితిలో నుంచనివారి జప ధ్యాన పూజ భజన యోగాదులన్నియు గజస్నానము వంటివే యగును. ఆ జంతువును ఎంత శుద్ధముగా స్నానము చేయించినను, సుందరమైన తిలకమును దిద్దినను వెంటనే మట్టిని దుమ్మును శరీరమంతటను చల్లుకొనును. ఆలాగున జరుగనీయక జిజ్ఞాసువులు, ముముక్షువులు, భక్తులు చూచుకొనుచుండ వలయును. అట్ల లేని కారణముచేతనే కొందరు చిరకాలమునుండి దైవమార్గములో ప్రవర్తించిన వారలయ్యు శుద్ధాత్ములు గాకపోవుటకు కారణమగుచున్నది. కావున ధ్యాన, జప, యోగ,భజన, పూజార్చనాది కాలములో యేలాగున పవిత్రులై యుందురో ఆలాగున యెల్లప్పుడును నుండేలాగున చేసుకొని మనో మాలిన్యమును గలుగ చేసెడి కోప, తాప, అసత్య, మోసపు కృత్యముల లోనికి మనస్సును జారనీయక

చూచుచుండ వలయును.

3. మంచి చేవగల బలమైన చందన వృక్షాదులు తగరపు కత్తిచే నరకిన యేలాగున తెగజాలవో ఆలాగున సామాన్య బాహ్యభక్తి వేషాదులచే బలమై యుండు చిత్తవృత్తులు తెగజాలవు. ఉక్కుతో చేయబడిన మంచి వాడి గల పెద్దగొడ్డలిచే యెట్టి వృక్షములైనను ఎడతెగక నరుకగల్గునట్లు తీవ్ర వైరాగ్య బోధోపరతులుగల మనస్సుచేతనే అంతఃకరణ వృత్తులను సమూలోచ్ఛేదనము జేయగల్గును.

4. జనులారా! గమనించవలయును. ఏ వృక్షమునుండి యెక్కువ ఫలములు లభించునో, అది ఫలించుటకు ఎక్కువ కాలము పట్టును. ఏ వృక్షములు త్వరలో ఫలించునో అవి శీఘ్రములోనే నశించునుగదా! దృష్టాంతముగా పనస, మామిడి, కొబ్బరి చెట్లు ఫలమునిచ్చుటకు కాలము అధికము పట్టును. కాని బహుకాలము వరకు ఫలమునిచ్చును. మిరప, వంకాయ చెట్లు త్వరలో ఫలము నిచ్చినను, శీఘ్రకాలములోనే నశించునుగదా? అదే రీతిగా, మీరు శాశ్వత ముక్తిఫలమునిచ్చెడు మోక్షమనెడి కల్పవృక్షమును పెట్టియున్నారు. కావున దాని ఫలము గల్గిన అనంతకాలము వరకు ఇచ్చుచుండును. కాబట్టి అది ఫలించుటకు కాల మధికముపట్టును.

చాతుర్మాస్య వ్రతము

శ్రీ శుకబ్రహ్మాశ్రమములో చాతుర్మాస్య వ్రతం 5-07-2020 పౌర్ణమి ఆదివారం నుండి ప్రారంభమైనది. ప్రతిరోజు సాయంకాలం భాగవతంపైన పూజ్యశ్రీ సర్వాత్మానందగిరిస్వాములవారు చెప్పుచున్నారు. ఉదయం అవకాశాన్ని బట్టి పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు ఉపనిషత్తులపై ప్రవచన చేస్తున్నారు. ప్రతిరోజు ఉపనిషత్పారాయణ స్తోత్రపారాయణలు, ధ్యానము జరుగుచున్నవి.

సాధన పంచకమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

మహావాక్యము-ఉపదేశ వాక్యముసామవేదము ఛాందోగ్యోపనిషత్ తత్త్వమసి :

ఉపదేశ వాక్యమైన'తత్త్వమసి' యను మహావాక్యము దశోపనిషత్తులలో విరాజమానమైన ఛాందోగ్యోపనిషత్తునకు సంబంధించినది. సమస్త యుపనిషత్తుల విషయమైన జీవ బ్రహ్మైక్యమును ప్రతిపాదించునదీ 'తత్త్వమసి' మహావాక్యము ఛాందోగ్యోపనిషత్తులో షష్ఠాధ్యాయమునకు సంబంధించినది. అరుణియను మహర్షి పుత్రుడైన ఉద్దాలకుడనే ఋషి తన పుత్రుడైన శ్వేతకేతువున కుపదేశించినదీ మహావాక్యము.అందుచే ఉద్దాలక శ్వేతుకేతు సంవాదము లోనిదీ'తత్త్వమసి'మహావాక్యమని ప్రసిద్ధి చెందినది. ఈ మహావాక్యమును శ్రవణము చేసి మననముగావించి, అవగాహనజేసుకొని అనుభవము లోనికి స్వానుష్ఠానము ద్వారా తీసుకొని రావడము, ఆ విజ్ఞానమును బుద్ధియందు ధరించడమే ముఖ్యము. బుద్ధియందీ మహా వాక్యార్థమును ధారణ చేసి దృఢాపరోక్ష జ్ఞానమును గలిగియుండడమేదో దానినే ఆత్మ సాక్షాత్కరమని, కైవల్యమని, మోక్షమని, జీవ బ్రహ్మైక్యమని, బ్రహ్మపదమని,నిర్వాణమని ఈ మొదలగు పేర్లతో వ్యవహరించెదరు.

ఈ 'తత్త్వమసి' యను మహావాక్యము అర్థము జేసికొనుట, అవగాహన, అనుభవమునకు తెచ్చుకొనుట యందు ప్రారంభములో యధిక ప్రయాస కష్టదాయకముగా నుండును. అనంతరము (క్రమక్రమముగా) విషయ మర్థమయి యానందమును శాంతిని కలిగించును.

తత్త్వమసి పదవీ విభాగము - తత్, త్వమ్, అసి

తత్త్వమసి సంగ్రహార్థము : 'తత్' అనగా సర్వజ్ఞత్వమును పరోక్షత్వమును

కలిగినది. పిపీలికాది బ్రహ్మ పర్యన్తము సమస్త జగత్తును వ్యాపించునది. సకలజీవుల హృదయ కమలములలోనూ విరాజమానమైన ఏ దివ్య చైతన్యము కలదో 'అది'. త్వమ్ అనగా ఈ వ్యాపకమైన చైతన్యమే 'నీవు'. 'అసి'అనగా అయినావు. ఈ ప్రపంచోత్పత్తి స్థితిలయములకు కారణ భూతమైన పరబ్రహ్మమేది కలదో, యా పరబ్రహ్మము నీవేయయి వున్నావని తాత్పర్యము.

ఈ ప్రకారముగా శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుండైన సద్గురువు సాధన చతుష్టయ సంపత్తి గలిగిన శిష్యునకు తత్త్వమసి మహావాక్యము నుపదేశించును. కనుక ఇది యుపదేశ వాక్యమనబడుచున్నది. మరియు ఈ మహావాక్యమును విపులముగా విచారింతము.

తత్పదార్థము : పరోక్షత్వ సర్వజ్ఞత్వాది ధర్మ విశిష్ట మాయోపాధికమగు ఈశ్వర చైతన్యమును భోధించును.

త్వమ్పదార్థము : ప్రత్యక్షత్వ అల్పజ్ఞత్వాది ధర్మ విశిష్ట అంతఃకరణోపాధికమగు జీవ చైతన్యమును బోధించును.

అసిపదార్థము : ఈ విధముగా నున్న జీవేశ్వర చైతన్యములకు ఏకత్వమును ప్రతిపాదించును.

ఏదైన ఒక వస్తువును సిద్ధిచేయాలంటే "లక్షణ ప్రమాణాభ్యాం వస్తు సిద్ధిః" అను న్యాయముననుసరించి లక్షణముచేత, ప్రమాణము చేతను వస్తు సిద్ధి జరుగును. 'తత్త్వమసి' మహావాక్యములో పరోక్షత్వ సర్వజ్ఞత్వాది విశిష్ట చైతన్యము, అల్పజ్ఞత్వాది విశిష్ట చైతన్యము ఈ రెండింటిలో విరుద్ధ ధర్మములను తొలగించుటకు, రెండింటిలో నున్న చైతన్య ఏకత్వ ప్రదిపాదనకు లక్షణ ద్వారా సిద్ధికుదురుతుంది.

"శక్య సంబంధో లక్షణా" : ఇచ్చట లక్షణము గూర్చి విచారింతము. ఎచ్చట ప్రత్యక్షాది ప్రమాణములయొక్క విరోధము వలన వాచకమగు

శబ్దము ముఖ్యార్థమును బోధింప సమర్థముకాజాలదో అటువంటి స్థలమున ఆ వాచక సంబంధమైన ముఖ్యార్థమునందు శబ్దమునకు ప్రవృత్తి కలుగును. ఆ ప్రవృత్తియే లక్షణమనబడును. ఏ వ్యాపారముచే శబ్దము ముఖ్యార్థమును బోధించునో ఆ వ్యాపారము లక్షణావృత్తియనబడునని సారాంశము. ఇది లక్షణావృత్తియొక్క సామాన్య స్వరూపము.

"సా లక్షణా ద్వివిధా" ఆలక్షణ రెండు విధములు "గౌణీలక్షణా శుద్ధాలక్షణా" గౌణమని, శుద్ధమని రెండు విధములు. "గౌణీనామ సాదృశ్య విశిష్టే లక్షణా". సాదృశ్యముతో గూడి యుండినదని యర్థము."యథా సింహెూమాణవకః" సింహమువంటి వాడీ బ్రహ్మచారియని భావము.

మానవమాత్రుడైన ఒక బ్రహ్మచారిని జనులుచూసి ఇతడు సింహము వంటి వాడనియందురు. సింహశరీరముతో, దాని అవయములతోను పోల్చి సరిచేసుకొంటే సాదృశ్య సిద్ధికుదరదు. సింహములో నున్న పరాక్రమము, శౌర్యము, క్రౌర్యము మరియు సింహము ముందుకు నడుస్తున్నపుడు ఎన్ని అస్త్రశస్త్రములు దానిపైబడినను భయముచెంది వెనుకకు మరలదు. కావున నావిధముగా నీ బ్రహ్మచారి యందు నీ గుణములున్నందున సింహము వంటి పరాక్రమము గలవాడని యర్థము. ఇటువంటి లక్షణములను గౌణీ లక్షణమని యందురు. లక్షణావృత్తి యొక్క విశేషమును విచారింతము. శుద్ధ లక్షణమనునది జహల్లక్షణా, అజహల్లణా, జహదజహల్లక్షణాయను నామములను పొంది మూడు విధములుగా నున్నది.

ఇందు జహల్లక్షణను గూర్చి విచారింతము.

జహల్లక్షణా : 'జహత్'అనగా విడిచినదని యర్థము.

లక్షణా : "శక్యమాత్ర పరిత్యాగేన తత్పంబంధి అర్థాంతరేవృత్తిః జహల్లక్షణా॥"

అథవా : "వాచ్యార్థం త్యక్త్వా వాచ్యార్థ సంబంధిని శబ్దస్య యః సంబంధః సఃజహల్లక్షణా॥"

అథవా : "లక్ష్యతావచ్ఛేదకరూపేణ లక్ష్యమాత్రబోధ ప్రయోజికా లక్షణా జహల్లక్షణా॥"

ముఖ్యార్థమును అనగా వాచ్యార్థమును వదలి దానితో సంబంధించిన అముఖ్యార్థమునందు (అన్యార్థమునందు) శబ్దమునకు గల ప్రవృత్తి లక్షణమనబడును.

పైన వ్రాయబడిన మూడు లక్షణములకు అర్థము ఒకటే. సంస్కృత పరిజ్ఞానము గలవారు సమానార్థకములనిచ్చే పదములతో వారివారి భాషాశైలినుద్దేశించి నిర్మాణము చేయుదురు. లక్షణార్థములలో భేదము లేదు. ఒక్కొక్క గ్రంథములో దేని గూర్చి లక్షణము చెపుచున్నారో ఆ లక్షణము భిన్న భిన్నముగా కనపడినపుడు శ్రోతలు అర్థము భిన్నమని భ్రమపడుట కవకాశములేదు. లక్షణములు భిన్నాభిన్నాముగా కనిపించినను ఒకే అర్థమని గ్రహింపగలరు.

యథా "గంగాయాం ఘోషః" అనునది దీనికుదాహరణము. గంగాయాం=ప్రవాహమునందు, ఘోషః=గొల్లపల్లె కలదు అని యర్థము. గంగా శబ్దము అభిధా వృత్తిచే ప్రవాహరూపార్థమును బోధించును. కాని వర్తమానమీ ప్రవాహాధారమగునర్థము ప్రత్యక్షాది ప్రమాణవిరుద్ధము. ఏలనన? వల్లె ప్రవాహమునందునెచ్చట నుండదు. ఎవరును చూచియుండరు కదా? కావున గంగా శబ్దము తనకు సంబంధించిన ముఖ్యార్థమగు ప్రవాహమును సంపూర్ణముగా వదలి, దీనికి సంబంధమైనది, ముఖ్యార్థము కానిది, తీరరూపార్థమును జహల్లక్షణావృత్తిచే బోధించును. ఈ విధముగా "గంగాతీరే ఘోషః" గంగ ఒడ్డునందు గొల్లపల్లె యున్నదనునర్థము సిద్ధించును. ఇది ప్రత్యక్ష ప్రమాణమునకు విరుద్ధము కాదు. సర్వులకు నీ విషయమనుభవసిద్ధమే. ఇచట గంగాశబ్దము లక్షణ మనియు, తీరము లక్ష్యార్థమనియు, ఈ రెండింటికి గల సంబంధము జహల్లక్షణ మని గ్రహింపవలెను.

ఈ విధముగా 'తత్త్వమసి' యను మహావాక్యమునందు తత్పద వాచ్యార్థమైన పరోక్షత్వ సర్వజ్ఞత్వాది విశిష్ట చైతన్యము, త్వమ్పద వాచ్యార్థమైన ప్రత్యక్షత్వ అల్పజ్ఞత్వాది విశిష్ట చైతన్యము, తత్పద త్వమ్పద విశేషణములతో కూడియున్నంత వరకు రెండింటికిసేకత్వ సిద్ధికుదరదు. కనుక అభిధావృత్తిచే బోధితములగు తత్ త్వం శబ్దముల వాచ్యార్థములు బాధితములైనవి. కావున లక్షణనాశ్రయించవలెను. అట్లని జహల్లక్షణనాశ్రయించిన నిష్టార్థము సిద్ధింపదు. ఏలనన ఎచట శబ్దము తన వాచ్యార్థమును సంపూర్తిగా విడచునో ఆ స్థలములో జహల్లక్షణ కుదురుచున్నది. అయితే ఈ మహావాక్యము నందు తత్ పదము గాని త్వమ్పదముగాని తన వాచ్యార్థమును పూర్తిగా విడచుట లేదు. చైతన్యాంశమునందు ఎట్టి విరోధము లేదు. కేవలము పరోక్షత్వ సర్వజ్ఞత్వాది ప్రత్యక్షత్వ అల్పజ్ఞత్వాది రూపమగు ఒకే అంశము నందు మాత్రమే విరోధము కలదు. "గంగాయాం ఘోషః" అనే విషయంలో ప్రవాహంలో గొల్లపల్లె అనే వాక్యములో ప్రవాహమునకు సంబంధినది. అతిరిక్తమైన తీరము (ఒడ్డు) నున్నది. దానిని గ్రహిస్తే ఉదాహరణ వాక్యము నందు సమన్వయమైనది. తత్త్వమసి మహావాక్యములో తత్పదవాచ్యార్థమైన పరోక్షత్వాది విశిష్ట చైతన్యము త్వమ్పద వాచ్యార్థమైన ప్రత్యక్షత్వాదివిశిష్ట చైతన్యమును జహల్లక్షణానుసారము సంపూర్ణముగా విడిచిన చైతన్యము కంటె అతిరిక్తమైనది. గ్రహించుటకన్యము లేదు కనుక జహల్లక్షణ కుదరదు. మరియు ఏ చైతన్యమును సిద్ధిచేయాలను కొంటిమో ప్రకృతమున ముఖ్యార్థమును సంపూర్ణముగా వదలినచో ఆ చైతన్యమును వదలి పెట్టినదగును. అపుడు ఈప్సితార్థమగు చైతన్యాభేదము పూర్తిగా సిద్ధింపదు. కావున జహల్లక్షణ ఇచట గ్రహింపదగినది గాదు. "విషం భుంక్ష్వ" "మంచాః క్రోశన్తి" ఈ మొదలగునవి "విషముతినుము" "మంచములు ఏడ్చుచున్నవి" ఈ విధముగానున్న జహల్లక్షణకు యుదాహరణలు వీటికి వాచ్యార్థమును పూర్తిగా విడిచిపెట్టి తత్సంబంధార్థమును గ్రహించట యవసరము. **(సశేషము)**

మృత్యోర్ముక్షీయ మా౨మృతాత్

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

ప్రపంచములో అందరికీ పరిచయములో వున్నదీ, నిత్యము వినబడేదీ, ఐనాగూడా ఎవ్వరూ ఇష్టపడనిదీ ఐన శబ్దము మృత్యువు. దేవాసురులు, మానవులు, తిర్యక్కులు అంటే పశుపక్ష్యాదులు వీటన్నిటికీ ఈ మృత్యువనేది భయముతో కూడినదీ తప్పించుకోలేనిదీ ఐన ఒక ఘట్టము. దేవతలు గొప్ప ప్రయత్నాన్ని చేసి శ్రీమన్నారాయణుడి అనుగ్రహము వలన అమృతము అనే దాన్ని త్రాగి తాత్కాలికంగా మృత్యువు కలగకుండా చేసుకున్నారు. ఐనా గూడా ఆయుర్దాయము ఒక మన్వంతరము అంటే మన సంవత్సరాల లెక్కలో దాదాపు 31 కోట్ల సంవత్సరాలు మాత్రమే. అసురులు అందరూ కూడా మృత్యువును తప్పించుకోవాలని గొప్ప గొప్ప ప్రయత్నాలను చేశారు. గానీ వారికి అది సాధ్యపడలేదు. “జాతస్య హి ధృవో మృత్యుః” (పుట్టిన దానికి మృత్యువు నిశ్చయము) అని శ్రీ మద్భగవద్గీతా వాక్యము.

మనిషిని గురించి విచారిద్దాము – మనిషి మృత్యువును ఎందుకు ఇష్టపడడు? తాను శరీరమే అని భావించి దాని ద్వారా ప్రాపంచిక సుఖాలను ఎల్లకాలము అనుభవించాలి అనే బలమైన కోరిక మృత్యువు వలన భగ్నమైపోతుంది అని దాన్ని ఇష్టపడడు. తను తనవారు తన సంపద ఇవి మనిషి సుఖానికి ఆస్పదము. మృత్యువు వలన ఇవి తనకు వుండవని ఒక భయము. ఇంతకన్నా పెద్ద భయము మరొకటుంది. అది ప్రత్యక్షంగా కనబడక పోయినా గతించిన అనేక జన్మలలో సూక్ష్మ శరీరంతో తాను అనుభవించిన అధివ్యాధులు, ఆకలి దప్పులు, శీతోష్ణాలు, నరకయాతనలు

ఇత్యాదులు అంతఃకరణంలో వుండి కలిగిస్తున్న భయము.

మృత్యువు వలన ప్రయోజనాలుగూడా వున్నాయి. “మృత్యుస్సర్వ హరశ్చాహమ్” (అన్నిటినీ అంతం చేసే మృత్యువును నేను) అని శ్రీమద్భగవద్గీత పదవ అధ్యాయంలోని వాక్యము. క్యాన్సరు, పక్షవాతము, కిడ్నీలు చెడిపోవుట మొదలైన భయంకర వ్యాధులకు గురియైన వారి బాధలకు మృత్యువు ఒక పరిష్కారము. ఇది గనక లేకపోతే వ్యాధి పీడితులకు ఆపైన వారికి సేవలు చేస్తున్న వారికి సుఖమన్నది లేక శాశ్వతంగా ప్రయాసా దుఃఖాలలో మునిగిపోవలసి వచ్చేది. ఇక మృత్యువన్నది లేనట్టైతే లోకకంటకులైన నరకుడు, హిరణ్యాకశిపుడు ఇత్యాది దైత్యదానవులు, ఆధునికులైన దుష్టరాజులు, క్రూర నియంతలు వీరి వలన లోకము శాశ్వతంగా బాధల్లో కూరుకుపోవలసి వచ్చేది.

మృత్యువును గూర్చి పరిశీలన – మనిషి శరీరంలో రెండు భాగాలున్నాయి. మనిషే గాకుండా సకల ప్రాణులలోనూ ఇదే వ్యవస్థ వుంది. మొదటిది అందరికీ మృత్యువు కనబడే సప్తధాతుమయ శరీరము (చర్మ మాంసరక్త ఎముక మజ్జ నరము మెదడు అనేవి సప్త ధాతువులు). రెండవది కంటికి కనబడని సూక్ష్మ శరీరము లేక లింగ శరీరము. శ్రోత్ర చక్షుత్వక్ జిహ్వా ఘ్రాణము అనే పంచజ్ఞానేంద్రియాలు, వాక్కు పాణిపాద పాయువు ఉపస్థలు అనే పంచకర్మేంద్రియాలు, ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములు అనే ప్రంచ ప్రాణాలు, భూమిజల అగ్ని వాయుఆకాశాలు అనే పంచభూతాలు, మనసు బుద్ధి చిత్త అహంకారములు అనే వృత్తులు గల అంతఃకరణము. వీటన్నిటి కూడలి లింగ శరీరము. చైతన్యంతో కూడిన ఈ లింగ శరీరానికే జీవుడు అని పేరు.

అన్నమయకోశము అని కూడా చెప్పబడిన స్థూల శరీరము తనలో గల లింగశరీరం ద్వారా చైతన్యవంతమై పోషించబడుతూ

ప్రపంచంలో వ్యవహారాలను చేస్తుంది. లింగ శరీరము లోని అహంకారము అన్నదీ స్థూల శరీరము ద్వారా ప్రాపంచిక సుఖాలను అనుభవిస్తుంటుంది. ప్రకృతి స్వాభావికంగా స్థూల శరీరము ఆరు వికారాలను అంటే మార్పులను పొందుతూ వుంటుంది. పుట్టుట ఉండుట, పెరుగుట మారుట క్షీణించుట నశించుట అనేవే ఆ మార్పులు. వీటిని నిరోధించే శక్తి సామాన్యులెవరికీ వుండదు. ఎప్పుడైతే స్థూల శరీరము క్షీణించిపోతూ తన సుఖానికి అనుకూలంగా వుండదో అప్పుడు జీవుడు దాన్ని వదిలి పెట్టి కొత్త శరీర సంపాదనకు వెళ్ళిపోతాడు. అరిగిపోయిన పాదరక్షలు, అరిగిపోయి చిల్లులు పడిన పాత్రలు, పనిచెయ్యని వాహనాలు సెల్‌ఫోనులు ఇత్యాదులను ఎవరు తమవద్ద పెట్టుకుంటారు? ఆవిధంగా అన్నమాట. జీవి వదిలేసిన స్థూలశరీరము పోషించే ఆధారము లేనందున క్రమంగా తను ఏర్పడిన పంచభూతాలలో కలిసి పోతుంది. దీనికే మృత్యువు అని పేరు. జన్మించుట అంటే జీవుడు స్థూలశరీరాన్ని పొందటమే, మృత్యువు అంటే జీవుడు స్థూలశరీరాన్ని వదిలెయ్యటము.

అందరు మహాత్ములు, గురువులే గాక భగవదవతారాలైన శ్రీరామ శ్రీకృష్ణులు గూడా వారి శరీరాలను స్వచ్ఛందంగా అంటే తమ ఇష్టానుసారము వదలిఅవతారాలను చాలించారు.

మరి "త్ర్యంబకం యజామహే..." మంత్రములోని మృత్యోర్ముక్షీయ (మృత్యువు నుండి విడిపించు) అన్న దాని భావమేమిటి?

చాలా గొప్ప రహస్యము ఏమిటంటే స్థూల శరీరాలు లేకబోయినా జీవులు తమ లింగశరీరాలతో సర్వదా జీవించే వుంటారు. శరీరమున్నప్పుడు ప్రపంచంలో అందరికీ కనబడతారు. అది లేనప్పుడు కనబడరు. విశ్వము పుట్టినప్పటి నుండి అగ్ని అన్నది ఉష్ణ గుణముతో

ఎల్లప్పుడూ వుంది. ఐతే ఒక నిప్పుపుల్లను గీరినప్పుడు వచ్చిన మంటను చూచి అగ్ని పుట్టింది అనీ, మంట ఆరిపోయినప్పుడు అగ్ని ఆరిపోయింది అని లోకము అనుకుంటుంది గదా! ఆ విధంగా అన్నమాట. శ్రీమద్భగవద్గీతలో "అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని అవ్యక్త నిధనాని" (జీవుల ఆద్యంతాలు కనబడవు మధ్యన కొంతకాలము కనబడతాయి) అని భగవానుడు దీన్నే తెలిపాడు.

అర్థాన్ని గ్రహించక బోయినా లౌకికుల మాటల్లో కూడా జీవికి మృత్యువు లేదనే స్పష్టమౌతుంది. ప్రాణం పోయిన మనిషిని ఫలాని వారు వెళ్ళిపోయారు. చనిపోయారు. స్వర్గస్థులైనారు అని అంటారు. దీని అర్థము. వారు సజీవంగానే వున్నారు అనే గదా! సజీవంగా వుంటేనే వెళ్ళిపోవటము అన్నది సంభవము. నిర్జీవమైన వస్తువులు తమంత ఎక్కడికీ వెళ్ళలేవు గదా! జీవితమంతా శరీరాన్నే వ్యక్తిగా భావించినవారు ప్రాణం పోగానే దాన్ని భౌతిక కాయము, శవము అని మాత్రమే అంటారు.

సారాంశ మేమిటి? మృత్యువు అంటే పాతశరీరాన్ని వదిలిపెట్టి జీవి కొత్త శరీరాన్ని పొందటమే, పాతవైన వాహనాలు, ఇళ్లు వస్త్రాలు, ఇత్యాదులను వదిలి కొత్తవి పొందుతుంటే ఎవ్వరు సంతోషించరు? ఐతే కొత్త శరీరాలు మేలైనవి పొందాలంటే అహింస సత్య దానధర్మ పరోపకార దైవారాధన సత్సంగాలనే సత్కర్మ ఆచరణ అవసరము. తప్పనిసరి ఐన మృత్యువుయొక్క తత్త్వాన్ని బాగా గ్రహించిన వారికి అది కలిగించే అనర్థమేముంది? మృత్యువు రాకూడదు అనుకోవడములో వివేక మేముంది?

ఐతే, లింగశరీర మున్నంతవరకు శరీరాలను పొందుట, సంసారయాతనలు, మృత్యువులు, శరీరరహితంగా వుండుట అన్నవి అనివార్యము. అతి ప్రయాసాకరములు. మరి ఆ లింగశరీరము

ఎంతవరకు వుంటుంది? - తన యథార్థ స్వరూపమైన చైతన్యము ఆనందము అమృతత్వము ఇత్యాదులను జీవి ఎంత వరకు గ్రహించదో అంతవరకు అది వుంటుంది. దీనికి సాధనముగా "త్ర్యంబకం యజామహే." అనే మంత్రము చెప్పబడింది. నిరంతర పరమేశ్వర ఆరాధనద్వారా ఆయన అనుగ్రహాన్ని సంపాదించి తన స్వరూపాన్ని ఎఱిగి ఆ స్థితిలో నిలిచినప్పుడు ఇక లింగ శరీరము కారణము లేనందున నశించి పోతుంది. జీవి శాశ్వతంగా జనన మరణాదులను దాటిపోయి అమృతత్వాన్ని పొందుతాడు. మంత్రము లోని "మృత్యోర్ముక్షీయ" అంటే ఇదే అర్థము. అంతేగాని మృత్యువు రాకుండా రక్షించు అని అర్థము కాదు. అమృతత్వాన్ని పొందటము కేవలము మానవ జన్మలోనే సాధ్యము. అందుచేత ఈ మానవ జన్మను నిర్విరామ అమృతత్వప్రాప్తి సాధనకు మాత్రమే ఉపయోగించుకుందాము **- ఓం తత్ సత్**

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. వై.వి.కేశవన్ (స్వామిశివానంద నిలయము) బెంగుళూరు	-	రూ. 2000/-
2. ఎ.మనోహరరావు (హైద్రాబాద్)	-	రూ. 2000/-
3. చల్లా గోపాలకృష్ణ (జిల్లెలగూడ-హైద్రాబాద్)	-	రూ. 2000/-
4. వై.శ్రీనివాసరావు (వనస్థలిపురం, హైద్రాబాద్)	-	రూ. 2000/-
5. కె.కనకదుర్గాదేవి (విశాఖపట్నం)	-	రూ. 1500/-
6. ఎ.వెంకటరామిరెడ్డి (నంద్యాల) 2వసారి	-	రూ. 2000/-
7. వి.జయరామశర్మ (సిద్ధిపేట)	-	రూ. 1500/-
8. పి.సాయిబాబు (మంగొల్లు)	-	రూ. 1500/-
9. శ్రీమతి బి.కామేశ్వరి (హైద్రాబాద్)	-	రూ. 2000/-
10. పాబోతు సుబ్రమణ్యం (గూడూరు) రెండవసారి	-	రూ. 1500/-

భయంకర సూక్ష్మ జీవులు

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

ఇటీవల విశ్వమంతటా వ్యాపించిన "కరోనా" గొప్ప అలజడి కల్గించింది. మనుజుల జీవితాలను అస్తవ్యస్తం చేసింది. వేలకొలది జనులు దానిబారినపడి ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ అనేకులు మరణిస్తూనే వున్నారు. కరోనా కరాళ నృత్యం ఇంకా ఎన్నాళ్లు ఇలాగే కొనసాగుతుందో తెలియదు.

కరోనా బెడద తప్పించుకోవడానికి యజ్ఞాలు, పూజలు, మంత్ర జపాలు, పారాయణలు వగైరా నిత్యమూ నిర్వహించబడుతున్నవి. అవి ఎంత వరకూ ఫల ప్రదాలు కాగలవో ఇప్పుడే చెప్పలేని దుస్థితి నెలకొన్నది.

'కరోనా' ఒక సూక్ష్మజీవి. అది కంటికి కనిపించదు. అంటువ్యాధి రూపంలో ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి సంక్రమిస్తుంది. బలహీనులు, దీర్ఘ రోగగ్రస్తులు, వృద్ధులు దాని బారిన బడితే తప్పించుకోవడం కష్టం. ఇది ప్రతక్ష సిద్ధమైన సత్యం.

ఇది కలియుగం. ఇట్టి ఉపద్రవాలు ఈ యుగానికి మాత్రమే పరిమితం కావు. పూర్వ పూర్వ యుగాలలో గూడా ఇలాంటి సూక్ష్మ జీవులు పలువిధాలుగా ప్రజలను బాధించినట్లు ప్రాచీన సారస్వతాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

యోగవాసిష్ఠం మహోత్కృష్టమైన వేదాంత గ్రంథం. వసిష్ఠుడు శ్రీరామునికి కావించిన తత్త్వబోధ యిది. ఇది ఆరుప్రకరణాలు, ముప్పది రెండు వలే శ్లోకాలతో నిబద్ధమై వున్నది. ఈ మహాగ్రంథాన్ని శ్రీమలయాళ

సద్గురు స్వాములవారు తెలుగు వివరణతోసహా మొదట ప్రచురింపజేశారు. శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు గీతా యజ్ఞాలలో గీతాప్రబోధంతోపాటు యోగవాసిష్ఠ ప్రబోధం కూడా నిర్వర్తించారు.

ఆ గ్రంథంలోని ఉత్పత్తి ప్రకరణం ద్వితీయ భాగంలో 'కర్కటి' అనే ఒక సూక్ష్మజీవి చరిత్ర కనిపిస్తున్నది. "కరోనా" లాగానే ఇది కూడా మహాభీకరమైన ప్రవృత్తి గల ఒక సూక్ష్మ జీవి. 'కర్కటి'కి 'కరోనా' నామాంతరమని కూడా కొందరు విద్వాంసుల అభిప్రాయం.

ఏది ఏమైనా కరోనా భీకర ప్రళయం సృష్టిస్తున్న ఈ దినాలలో యోగవాసిష్ఠంలోని కర్కటి వృత్తాంతాన్ని గూడా వేదాంతభేరీ పాఠకులకు పరిచయం చేయడం సముచితమని భావించి సంగ్రహంగా కర్కట్యు పాఖ్యానం ఈ క్రింద వివరించబడుతున్నది.

హిమాలయానికి ఉత్తర దిశలో 'కర్కటి' అనే ఒక రక్కసి ఉండేది. అది కాటుక ప్రతిమ లాగా నల్లగానూ, మిక్కిలి భీకరంగానూ కనిపించేది. దానికి 'విషూచిక' అన్యాయబాధిక అని అదనంగా రెండు పేర్లు ఉండేవి.

ఆ కర్కటి మానవ కంకళాలను పూలమాలగా ధరించేది. దాని శరీరరం చాలా పెద్దది. అందుచేత దానికి సరిపడినంత తిండి దొరికేది కాదు. దాని జఠరాగ్ని బడబాగ్ని లాగా తృప్తి లేకుండా మండుతుండేది.

అది ఒకనాడు ఇలా తలపోసింది "సముద్రం సకల నదీ జలాలనూ గ్రహించినట్లు నేను ఈ జంబూద్వీపంలోని ప్రాణులు నన్నింటినీ ఒక్కసారిగా మ్రింగితే నా ఆకలి తీరుతుంది. అయితే మంత్రాలు, ఔషధాలు, దేవపూజలు మొదలైన వాటితో రక్షింపబడి వున్న జనానీకాన్నంతటినీ ఒకే తడవ మ్రింగడం ఎలా సాధ్యం? దృఢమైన చిత్తంతో తీవ్ర తపస్సు చేస్తాను. ఉగ్రమైన తపస్సుతో సాధ్యం కానిదేమున్నది".

ఇలా అనుకొని ఆ రాక్షసి దుర్గమమైన హిమాలయ శిఖరం చేరుకొన్నది. అక్కడ స్నానం చేసి ఒంటికాలిపై నిలిచి తపస్సుకు ఉపక్రమించింది. అది తపస్సు చేస్తుండగా, ఎన్నో పగళ్ళు, పక్షాలు, మాసాలు, ఋతువులు గడచిపోయాయి. గాలి తాకిడికి దాని శరీరం జర్జరితమయింది. వ్రేలాడే చర్మమే వస్త్రంగా రూపొందింది. పైకెగసిన కేశాలతో, తారలనే ముత్యాలు ధరించి వున్న ఆ కర్కటిని బ్రహ్మ చూచాడు. వరప్రదానం చేయడానికి దానిచెంతకు వచ్చాడు.

విషూచికా మంత్రం : కర్కటి కావించిన వెయ్యి సంవత్సరాల తపస్సుకు మెచ్చి బ్రహ్మ దానిముందు ప్రత్యక్షమయ్యాడు తపస్సుకు సాధ్యం కానిదేమున్నది?

ఆ రాక్షసి బ్రహ్మకు మనస్సుతోనే నమస్కరించింది. బ్రహ్మ ఇలా అన్నాడు.

"పుత్రీ! రాక్షసకులమనే కొండమీద మేఘమాలికలైన ఓ కర్కటీ! లెమ్ము! నీ తపస్సుకు మెచ్చాను. నీకిష్టమైన వరమిస్తాను. కోరుకో!" అప్పుడు కర్కటి ఇలా అన్నది.

"భగవన్! భూతభవ్యేశ్వరా! నేను అయోమయమైన సూదిగానూ, అమోయమంకాని విషూచి గానూ, అయ్యేటట్లు నాకు వరం ప్రసాదించు".

అందుకు బ్రహ్మ "అలాగే అగుగాక"! అని అది కోరిన వరం అనుగ్రహించాడు. మళ్ళీ ఇలా అన్నాడు – "నీవు సూచికగానూ, విషూచిక గానూ అవుతావు. సూక్ష్మమైన మాయతో సర్వలోకాన్నీ హింసిస్తావు. దుష్ట భోజనాలు చేసేవారూ, దుష్కార్యరతులైన మూర్ఖులూ, శాస్త్ర విరుద్ధ మార్గంలో

చరించేవారూ, దుష్టమైన దేశంలో నివసించేవారూ అయిన దుర్జనులు నీహింసకు గురి అవుతారు. వాయులేఖారూపిణివైన ప్రాణుల హృదయంలో ప్రవేశించి వారి అవయవాలను బాధించే విషూచికగా అవుతావు. గుణవంతుడు, గుణహీనుడు అనే తేడా లేకుండా అందరినీ బాధిస్తావు".

ఈవిధంగా చెప్పి బ్రహ్మ మళ్ళీ ఇలా అన్నాడు. "వ్యాధికి గురి అయిన గుణవంతుల చికిత్సకై ఈ క్రింది మంత్రం చెబుతున్నాను."

"హిమాద్రికి ఉత్తరాన కర్కటి అనే రాక్షసి ఉన్నది. దానిని 'విషూచిక' 'అన్యాయ బాధిక' అని కూడా అంటారు... దానికి మంత్రం.

"ఓం హ్రీం హ్రాం రీం రాం విష్ణుశక్తయే నమః. ఓం నమో భగవతి! విష్ణుశక్తిమేనాం ఓం హరహర నయనయ పచపచ మథమథ ఉత్సాదయ దూరే కురు! స్వాహా! హిమ వంతం గచ్ఛ!" జీవ సఃసఃసః చంద్రమండలగతో౽సి స్వాహా"

(మంత్రార్థం –ఓం ఇత్యాది బీజరూపమైన విష్ణుశక్తికి నమస్కారం. భగవతీ! విష్ణుశక్తీ! నీ అంశమైన ఈ విషూచికను హరించు, హరించు, తీసుకుపో తీసుకుపో, ఉడికించు, ఉడికించు, మథించు మథించు, తొలగించు, దూరీకరించు, స్వాహా! ఓ రోగశక్తీ, హిమతత్పర్వతానికి వెళ్ళిపో! ఓ జీవుడా! నీవు మృతులకు ఉజ్జీవింపజేయగల చంద్ర మండలం చేరుకొన్నావు. స్వాహా")

అని మాంత్రికుడు ఈ మహామంత్రాన్ని ఎడమ చేతిపై వ్రాసి రోగి శరీరాన్ని ఆ చేతితో తుడవాలి. రోగశక్తి హిమాలయానికి పారిపోయిందని భావించాలి. రోగి జరామరణ రహితుడై, సర్వవ్యాధి నిర్ముక్తుడై, చంద్రమండలంలో రసాయన హృదయ గతుడైనట్లు చింతించాలి. మంత్ర సాధకుడు శుచిమంతుడై, ఏకాగ్రచిత్తంతో ఆచమనం

చేసి ఇలా అనుష్ఠిస్తే విషూచికా పీడ పూర్తిగా నశిస్తుంది."

త్రిలోక ప్రభువైన బ్రహ్మ ఇలా చెప్పి గగనగతుడయ్యాడు. ఆకసంలోని సిద్ధులు ఆయన చెప్పిన మంత్రాన్ని గ్రహించారు. అప్పుడక్కడికి వచ్చిన ఇంద్రుడు తనకు నమస్కరిస్తూ వుండగా బ్రహ్మ ఉజ్జ్వలమైన వైభవంతో అక్షయమాయామయమైన తన సత్యలోకానికి వెళ్ళాడు.

కర్కటి వ్యవహారం : తరువాత పర్వతశిఖరం వంటి ఆ నల్లని రక్కసి సన్నబడ జొచ్చింది. క్రమక్రమంగా సన్నబడుతూ చెట్టుకొమ్మ, మనుష్యుడు, హస్తం, జుత్తిలి, వ్రేలు, పెసరకాయ వంటి ప్రమాణం కలదిగా రూపొందింది. చిట్టచివరికి సూదిగా మారిపోయింది. అణుపరిమాణంతో భాసించింది. ఇనుపసూదిగానే కాక జీవసూచిగా కూడా తయారయింది. సూక్ష్మ శరీరంతో చలిస్తూ ఆకాశములో విహరించసాగింది.

అది యిప్పుడు సూదిలాగా వున్నదే కాని అందులో ఇనుము లేదు. బయట తిరగాలనే కౌతుకంతో తామరతూడునుండి వెలికి వచ్చిన తంతువు లాగా తోచింది, సుషుమ్నానాడి లాగా భాసించింది.

అదృశ్యంగా వున్న జీవసూచి దానిని సదా అనుసరించే వుంటూ వచ్చింది. ఆ కర్కటి లోకాన్నంతా మ్రింగదలచి సూదిగా మారింది. దేహరహితమైన స్థితిలో అది తన కోర్కెను ఎలా తీర్చుకో గలదు? ఈ సంగతి అది విచారించలేదు. అది తిండిని గురించి ఆలోచించిందే కాని సూచీరూపాన్ని గురించి పరిశీలించలేదు. స్థూలశరీరం వదలి సూదిలాగా మారిన ఆ రక్కసికి చావు గూడా సుఖంగానే తోచింది.

రెండవ జీవసూచిక ఆకారం లేనిదై లింగ శరీరం దాల్చి జీవులను వివిధ రోగాలతో బాధించే విషూచిగా రూపు దాల్చింది. పరుల ప్రాణాలను

బలిగొనడమే పరమార్థంగా భావించిన అరక్కసి మనోవృత్తియే అలా విషూచికా రూపంతో సాక్షాత్కరించింది. సూక్ష్మమైన ఆరెండు శరీరాలతోనూ అది మనుజుల హృదయములో ప్రవేశించి వేధిస్తూ దశదిశలా తిరిగింది.

అది దిగంతాలలో పరిభ్రమించడం ప్రారంభించగానే అవిద్యా కల్పితమైన దాని తొల్లిటి శరీరం పెనుగాలి తాకిడికి శరత్కాల మేఘంలాగా విశీర్ణమయింది. అది అస్వస్థులైనవారి శరీరంలో అతి విషూచికా రూపంతో ప్రవేశించి వారిని బాధించింది. ఆరోగ్యవంతులనూ, బుద్ధిమంతులనూ సైతం వదలక పీడించ సాగింది. అది ఒక్కొక్కచోట తనస్వైర విహారంతో తృప్తిపడేది. ఒక్కొక్కచోట మణిమంత్రౌషధాదుల ద్వారా పరిహరింపబడేది.

అలా అది రెండు శరీరాలతో పర్యటిస్తుండగా, చాలా సంవత్సరాలు గడచిపోయాయి. అది నగరాలలో, గ్రామాలలో రాకపోకలు సాగించి అలసి పోయేది. చేతి నుండి జారిపోతే ఎక్కడో విశ్రాంతి కోరిన దానిలాగా కనిపించకుండా దాగుకొనేది. అది జీవసూచికతో గూడి సర్వత్రా సంచరించింది.

గాలికెగిరిన పొట్టులాగా అంతఃకరణ ప్రేరణతో దిగంతాలకు ఎగబ్రాకింది. ఇతరులు తనలోకి ప్రవేశపెట్టిన సన్నని నూలు పోగులు భక్షిస్తూ అది పొట్ట నింపుకొనేది. అది ఒక్కొక్క సారి తన క్షీణరూపాన్ని తలంచుకొని పరితపించేది. కాని తన స్వభావాన్ని అనుసరించి ప్రాణులను బాధించడానికే మళ్ళీ పూనుకొనేది. క్రౌర్యమే దాని స్వభావం. ఇతరులను వేధించడమే దాని కార్యం.

దరిద్రుడికి ఒక గవ్వ దొరికితే అదే పదివేలుగా భావిస్తాడు. అలాగే అది ఒకరక్త బిందువుతోనే సంతోషపడసాగింది. దాని రాక్షస ప్రవృత్తి అలాంటిది. రెండు రకాల సూచికా రూపంతో గర్వించి అది మానవుల

మరణాన్నే ఊహించసాగింది. ఇతరులకు అపకారం చేయకపోతే దానికి దుఃఖం కలిగేది. దైవిక చేష్టలాగా జీవసూచిక అదృశ్యరూపంతో జీవులను క్రూరంగా వేధించేది.

ఆ సూచిక బురదలో మునుగుతుంది. ఆకసంలో ఎగురుతుంది. గాలితో గూడి దిక్కులలో విహరిస్తుంది. అంతఃపురంలో పట్టె మంచంపై శయనించినట్లే ధూళిలో విశ్రమిస్తుంది. అడవిలో మేను వాల్చుతుంది. మానవుల చేతిలోనూ, చెవిలోనూ, గొర్రె బొచ్చులోనూ విశ్రమిస్తుంది. కొయ్య, గోడ మొదలైన వాటి రంధ్రాలలో ప్రవేశిస్తుంది. మాయావిలాగా, తన ద్రవ్యాత్మ శక్తితో అది సర్వత్రా యథేచ్ఛగా విహరించింది.

కర్కటి విచారం : ఆ కర్కటి అలా నరమాంసం తింటూ చాలా కాలం గడిపింది. కాని దానికి తృప్తి కలుగలేదు. నిజంగా సూచి ఆకలి తీరడానికి ఒక్క రక్తబిందువే చాలు. కాని తృష్ణ అనే సూదికి తృప్తి కల్గించడం చాలా కష్టం !

ఆ కర్కటి ఒకనాడు తనలో తానిలా చింతించింది. "అయ్యో! కష్టం! నేనెందుకిలా మారిపోయాను? ఎంతో సన్నబడి పోయాను! నా శక్తి నశించింది. నాలో ఒక్క కబళం కూడా ఇపుడు పట్టడం లేదు. నా విశాలమైన అవయవాలెక్కడ పోయాయి? నేను మందభాగ్యరాలను. ఇప్పుడు రుచికరమైన మాంసాహారం ఇసుమంత కూడా నా పొట్టలో ఇమడడం లేదు.

నేను బురదలో కూరుకుపోతున్నాను. నేలపై పడిపోతున్నాను. ప్రజల కాలి తన్నులకు గురి అవుతున్నాను. నేను దిక్కులేని దానినయ్యాను. ఒక దుఃఖం నుండి మరొక దుఃఖంలోనికి ప్రవేశిస్తున్నాను. చెలికత్తె, దాసి, తల్లి, తండ్రి, సోదరుడు, సుతుడు, బంధువులు మొదలుగా నా

అనే వారెవరూ నాకు లేకుండా పోయారు.

నాకసలు శరీరమే లేకుండాపోయింది. ఆశ్రయం కరవయింది. నిలువ నీడ లేనిదానినై గాలికి కొట్టుకుపోయే ఎండుటాకులా, ఇటూ అటూ తిరుగుతున్నాను. ఆపదలో చిక్కుకున్నాను. చనిపోతే బాగుండుననుకొంటున్నాను. కాని ఆ చావు గూడా రావడం లేదు. ఒకపుడు పొగలో కొట్టుమిట్టాడుతున్నాను. మరొకసారి దారిలో పొరలాడుతున్నాను. ఇంకొకసారి గడ్డిపరకలోకి నెట్టి వేయబడుతున్నాను. అయ్యో!నా దుఃఖ పరంపరను ఏమని చెప్పుకొనేది?

కీటకం కంటె సూక్ష్మమై దారిలోని ధూళిలో పొరలాడే నన్ను ఎవడు ఉద్ధరిస్తాడు? అజ్ఞాన సాగరంలో పడివున్న నాకు అభ్యుదయం ఎలా సిద్ధిస్తుంది? విపత్తులనే గుంటలలో పడి పొరలాడుతూ నేనిలా ఎంతకాలం ఉండిపోవాలో నాకు తెలియడం లేదు.

నేనే పాడు తపస్సు అనే అగ్నిలో నా శరీరాన్ని పడవేసి సూదిగా మార్చుకొన్నాను. దిక్కులన్నిటా వ్యాపించిన కాటుకకొండవంటి ఆ నా శరీర మెక్కడ ? సాలెపురుగు కాలికొనలాగా తృణపేలవమైన ఈ సూచీత్వం అపేక్షించి భాసుర శరీరాన్ని వదలుకొంటిని గదా! ఓ నా దీర్ఘ బాహువులారా! మీరెక్కడికి పోయారు. నేనిప్పుడు దోమగిట్టకు సైతం ఊగిపోయే సూదిగా మారిపోయానే ! ఆకాశాన్ని నింపివేసిన ఆ నా శరీరమెక్కడ? ఈ సూదిరూప మెక్కడ? రోదో రంధ్రం వంటి ఆ నోరెక్కడ? ఈ సూది బెజ్జం ఎక్కడ? బహుమాంసభార బహుళమైన ఆ భోజనమెక్కడ? ఈ జలబిందు భోజనమెక్కడ? ఔరా ! నా వినాశాన్ని నేనే చేతులారా కొని తెచ్చుకొన్నానే!!!

ఆ కర్కటి ఇలా ఆలోచించి మౌనం వహించింది. (సశేషం)

మూలం: వేద వ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం: యేలేశ్వరపు హనుమరామకృష్ణ

ఎవరు దేనికి అధికారులు ?

1.కర్మయోగాధికారులు – వేదములలోని కర్మకాండ (సంహిత): ఎవ్వరికైతే కర్మలు నిర్వర్తించటంలో అభిరుచి ఉంటుందో, కర్మఫలములందు ఎవ్వరికైతే ఆసక్తి మానసికంగా కొనసాగడం జరుగుతోందో... అట్టివారి కొరకై కర్మయోగము నాచే మోక్షమార్గంగా చెప్పబడింది.

కర్మ ఫలములపట్ల విరక్తి చెందనివారు,"కర్మఫలములు అంతిమంగా దుఃఖముతో కూడినవే కదా!..అనే అవగాహనతో కూడిన బుద్ధిని ఇంకనూ పెంపొందించుకోని వారు సకామకర్ములు. వీరుకర్మయోగ మార్గమునకు అధికారులు (They better deserve to the path of Karma Yoga) వీరి కొరకై నిత్య –నైమిత్తికంగా నిర్వర్తించవలసిన ఆయా విధానము – తీరు. వాటికి సంబంధించిన నియమ-నిష్ఠలు ఇత్యాదులన్నీ వేదములచే చెప్పబడుచున్నాయి. అవి ఎప్పటిదాకా అవసరం? సకామకర్మలపట్ల - కర్మఫలముపట్ల అభిలాష ఉన్నంతవరకు! అయితే... సకామి అయి యజ్ఞ యాగ-వ్రత-ప్రాణోపాసన నియమాదులు నిర్వర్తించుటచే ఈ జీవుడు సుఖమయమగు స్వర్గలోకాలు పొందుచున్నాడు కూడా! నిషిద్ధ కర్మలు నిర్వర్తించటంచేత దుఃఖదాయకములగు లోకములు పొందటం జరుగుచున్నది.

వేదములలోని కర్మ విభాగము –ఇవి నిషిద్ధ కర్మలు,ఇవి ఆశ్రయించ వలసిన కర్మలు అని బోధిస్తున్నాయి. సూచిస్తున్నాయి. నియమిస్తున్నాయి. హేయ –ఉపాదేయ కర్మ మార్గాలను నిర్దేసిస్తున్నాయి. వాటిని శ్రద్ధగా ఆశ్రయించుచున్నవాడు క్రమంగా నిష్కామి అయి, మోక్షమునకను

అర్హుడగుచున్నాడు!

2 భక్తియోగాధికారులు - వేదములలోని ఉపాసనాకాండ (బ్రాహ్మణములు): ఏదో కారణంచేత అవతారమూర్తుల కథలయందు త్రిమూర్తులయందు, దేవతామూర్తులయందు ఆదరము కలిగియున్నవాడు, విషయములపట్ల వైరాగ్యము కలిగియున్నవాడు, (లేదా) ఆదరణ- ఆకర్షణ (Attraction) తగ్గుచూ వస్తున్నవాడు...అట్టివాడు భక్తియోగమునకు అర్హుడై ఉంటున్నాడు. అతనికి భక్తియొక్క అభివృద్ధికొరకై దేవతా - అవతారమూర్తుల ఉపాసనలు, స్తోత్రములు, ధ్యాననిష్ఠలు. ఇత్యాదులన్నీ వేదములయొక్క వివిధ బ్రాహ్మణముల విభాగములో అందించబడుచున్నాయి.

నిషిద్ధకర్మ త్యాగి-శుద్ధచిత్తుడు - స్వధర్మపరాయణుడు. ఇట్టివాడు మరేలోకం వెళ్ళవలసిన అవసరం లేకుండానే ఇక్కడే క్రమంగా జ్ఞాన భూమికలను అధిగమిస్తూ భక్తిని పెంపొందించుకుంటున్నాడు. జ్ఞాన భక్తి సంపాదించుకుంటున్నాడు. ఓ ఉద్ధవా! ఈ మానవజన్మ గొప్ప అవకాశం సుమా! ఎందుకంటావేమో ?

అటు స్వర్గలోకంలోగాని - ఇటు నరకలోకంలో గాని జ్ఞానభక్తిని సాధించటానికి ఇంతటి అవకాశాలు వుండవు. అందుచేత జ్ఞానభక్తుడుగా రూపుదిద్దుకుంటున్నవాడు- మానవజన్మనే అధికంగా కోరుకుంటాడు గాని స్వర్గలోక నివాసం కాదు. క్రమంగా భక్తి ప్రపత్తులు ప్రవృద్ధం అవుతూ ఉండగా...

శ్లో॥ న నరః స్వర్గతిం కాంక్షేత్, న నారకీం వా విచక్షణః

న ఇమం లోకం చ కాంక్షేత దేహావేశాత్ ప్రమాద్యతి ॥ (అధా 20,శ్లో13)

దేహమే దేహికి ఒక తీరుగా సాధన వస్తువు - మరొక తీరుగా ఐహిక మోహం కదా! అందుచేత ఉత్తమ భక్తి- ప్రపత్తులు రూపుదిద్దుకుంటూ

ఉండగా...ఇక అతడు స్వర్గము కోరడు. నరకము కోరడు. ఈలోకంలో ఏదో స్థానము కోరడు. ఏ దేహం వచ్చినా- రాకున్నా నా బుద్ధి మాత్రం సర్వదా మీ పాదాలు ఆశ్రయించి ఉండే వరం ప్రసాదించు స్వామీ! .... అని మాత్రమే నన్ను కోరుకుంటూ ఉంటాడు. అతడికి నేను తప్పితే మరింకేమీ అక్కర్లేదు. ఆతనిపట్ల - భక్తియే మోక్షస్థానమై ప్రకాశిస్తోంది!

3. జ్ఞాన యోగాధికారులు : భక్తిచే జ్ఞానము- జ్ఞానముచే భక్తి ప్రవృద్ధమై ఏకత్వము సంతరించుకొని "ఆత్మౌపమ్యేన సర్వత్ర సమంపస్యతి." అను ఆత్మసాక్షాత్కార స్థితిని కోరుకొనేవారికి జ్ఞానయోగ మార్గము ఉపనిషత్తుల ద్వారా, తదితర వేదమహా వాక్యములద్వారా (తత్త్వమసి, జీవోబ్రహ్మైవ నాపరః - అయమాత్మా బ్రహ్మ - సో ఒ హమ్- తత్త్వమ్ ఇత్యాది మహావాక్య శబ్దముల ద్వారా) వేదములు బోధిస్తున్నాయి. ఓ ఉద్ధవా! ఈ మానవ దేహము అశాశ్వతమైనది. వృద్ధాప్య వినాశనశీలము.- అనారోగ్యము- ఇత్యాది దోషములు కలిగియున్నట్టిది ! ఇది అందరికీ తెలిసిన విషయమే కదా! అయితే మాత్రం ఏం ? జీవితము అనేది మహత్తరమైన అవకాశము. ఈ మానవ దేహము జీవునికి కర్మయోగము - భక్తియోగము-జ్ఞానయోగము ప్రసాదించగల అవకాశములు కలిగి ఉన్నట్టిది. మోక్షము అనే పురుషార్థమును ప్రసాదించగలిగినది సుమా! అందుచేత జీవుడు ఏం చేయాలి?

ఈ పురుషుడు అప్రమత్తమైన - సముత్సాహముతో కూడిన (Very alert and enthusiastic) భావన - ప్రయత్నము - ఉద్దేశ్యములతో..... మృత్యువు సమీపించటానికి మునుముందే... ముక్తికై ప్రయత్నాలు చేయాలి! కర్మ - భక్తి -జ్ఞానయోగములు మూడిటినీ ఒకేసారి సమీకరించుకోవాలి! అని గమనించబడు గాక ! కర్మ-భక్తి-జ్ఞాన మార్గాలను వేరువేరైనట్లుగా చూడవద్దు అనుకోవద్దు. ప్రతి ఒక్కదానిలో మిగిలిన రెండూ ఉన్నాయనేది గమనించు!

అహంకారం

- కె. ఈశ్వర్

కారాలు అనేక రకాలు.

అహంకారం, మమకారం, దురహంకారం. ఈ కారాలు మానవునికి వికారము గలిగించి ఆకారము చెడగొట్టును.

ఈ కారాలు గలవాడు అధోగతి పాలుగాక తప్పదు. చరిత్రపుటలు తిరగవేస్తే దుర్యోధనుడు, దుశ్శాసనుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు మొదలగువారు అహంకార మమకారాల చేతనే వినాశాన్ని కొని తెచ్చుకొన్నారు. నిండుకుండ నిండుగ మెండుగ స్థిరంగ వుండును. వెలితి కుండ కదులు చుండును. అలాగె పెద్దలు, మహాత్ములు తమకు ఎన్ని విద్యలు వున్నను, తపస్సు వున్నను అలా వున్నట్లు గోచరించరు. కాని కొద్దిపాటి మిడిమిడి జ్ఞానము గలవారు పొంగి పొంగి గొప్పలు చెప్పుకొనుచుందురు.

బిరుదులు, సన్మానములు ఇచ్చువారు లేనిచో వారే ఇతరులను ప్రేరేపించి వాటి ఖర్చు భరాయించి తమకొరకై ఉత్సవాలు ఊరేగింపులు చేసుకొనువారు లేకపోలేదు.

ఒక పండితుడు పలురకాలైన బిరుదులు గల బోర్డు తన ఇంటికి తగిలించుకొనుట చూచిన ఒక స్నేహితురాలు పండితుని భార్యతో "నీ భర్త గారికి ఈ బిరుదులు ఎక్కడివి? ఎవరిచ్చార"ని అడుగగా "అంతటి మహానుభావునికి ఒకరిచ్చుట తీసుకొనుట ఎందుకని మంచిరోజు చూచి వారే ఏర్పాటు చేసుకున్నార"ని పండితుని భార్య సమాధానమిచ్చిందట. బిరుదులు సన్మానాలు ఊరేగింపుల మీద వున్న శ్రద్ధ పదిమందికి ఉపయోగపడు కార్యములపై దృష్టి కేంద్రీకరింపజేసి తమ ధనమును సద్వినియోగపరచువాడే మానవ జన్మకు శోభతెచ్చువాడు. అలా కానివాడు "మానవుడు" అనే పదమునకు కళంకము తెచ్చినవాడే యగును. కాబట్టి జనులు ప్రయత్నపూర్వకముగ అహంకార, మమకార, అపకారములను తొలగించుకొని ఉపకారమును చేబట్టి బ్రహ్మాకారమును పొంది విరాజిల్లవలెను. ఇదియే మానవుని జీవిత లక్ష్యము.

వేదాంతసారము

(గత సంచిక తరువాయి) - శ్రీ సదానంద యోగీంద్రులు

నిషిద్ధాని - నరకాద్యనిష్టసాధనాని బ్రాహ్మణ హననాదీని ॥ 8

తా॥ నరకమును చేర్చు బ్రహ్మహత్యాది కర్మలు పాపకర్మలు. కావున అవి నిషిద్ధ కర్మలగుచున్నవి. ఈ కర్మలు పరమందు నరకమును, ఇహమందు దుఃఖమును కలిగించును.

నిత్యాని -అకరణే ప్రత్యవాయసాధనాని సంధ్యావందనాదీని 9

తా॥ కొన్ని వేదోక్త కర్మలు కలవు. అవి చేయుట వలన క్రొత్తగా పుణ్యము కలుగదు గాని అవి చేయకపోవుటవలన తప్పక పాపము మాత్రము కలుగును. అట్లు ఆ కర్మల నాచరించకపోవుటవలన కలుగు పాపము కలుగకుండ చేయుటకే ఆ కర్మలను చేయవలయును. వీనినే నిత్యకర్మలందురు.

సంధ్యావందనము, పంచమహాయజ్ఞములు మొదలైనవి గృహస్థునకు నిత్యకర్మలై యున్నవి.

నైమిత్తికాని - పుత్ర జన్మాద్యనుబంధీని జాతేష్ట్యాదీని

తా॥ ఒక నిమిత్తమును పురస్కరించుకొని చేయు కర్మలు నైమిత్తికములు. ఉదాహరణకు పుత్రజన్మను నిమిత్తముగా చేసికొని చేయు జాతేష్టి మొదలైనవి. ఇవి కూడా గృహస్థునకు విహితకర్మలే యగుచున్నవి.

ప్రాయశ్చిత్తాని - పాపక్షయ సాధనాని చాంద్రాయణాదీని ॥

తా॥ పాపపరిహారార్థముచేయు కర్మలు ప్రాయశ్చిత్తములు. ఉదాహరణకు చాంద్రాయణాదులు. కృచ్ఛ్రము మొదలగునవి కూడ వీనిలో చేరుచున్నవి.

ఉపాసనాని-సగుణబ్రహ్మ విషయమానసవ్యాపార రూపాణి శాండిల్యవిద్యాదీని 12

తా॥ మానసికమైన సగుణ బ్రహ్మారాధన ఉపాసనయగుచున్నది. శాండిల్య విద్యయందు ఈ ఉపాసనా విధులు పేర్కొనబడి యున్నవి. జీవ బ్రహ్మైక్యమును

కలిగించునట్టి జ్ఞానకాండకంటె యీ ఉపాసన భిన్నమగు చున్నది. ఇట్టి ఉపాసనాసౌలభ్యము కొరకే త్రిమూర్త్యాది సగుణ రూపములను రూపొందించినారు. ఇట్టి సగుణోపాసన ద్వారా మనస్సు ఏకాగ్రతను పొందుచున్నది. కావున అట్టి ఏకాగ్రత పొందిన మనస్సునకు బ్రహ్మజ్ఞానము సిద్ధించును.

ఛాంగోగ్యోపనిషత్తులోని శాండిల్యవిద్య యిట్టి ఉపాసనయే యగుచున్నది.

ఏతేషాం నిత్యాదీనాం బుద్ధిశుద్ధిః పరం ప్రయోజనమ్

ఉపాసనానాం తు చిత్తైకాగ్ర్యం "తమేత మాత్మానం

వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన"

(బృ ఉః 4-4-22) ఇత్యాది శ్రుతేః "తపసా కల్మషం

హన్తి" (మను. 22-104) ఇత్యాది స్మృతేశ్చ॥ 13

తా॥ ఈ నిత్య నైమిత్తికాది కర్మలు చిత్తశుద్ధిని కలిగించును. ఉపాసనలు చిత్త ఏకాగ్రతను కలిగించును. ఇదియే వీని పరమప్రయోజనము. "నిత్యనైమిత్తికైరేష కుర్వాణో దురితక్షయం-నిత్యనైమిత్తిక కర్మలచే పాపమును క్షీణింపచేసి" అని స్మృతియు, "స్వే స్వే కర్మణ్యభిరతః - తమ తమ కర్మలను చేయుచు మానవుడు సంసిద్ధిని పొందుచున్నాడు" అని గీతయు చెప్పుచున్నది. ఇంతేకాక నైష్కర్మ్యసిద్ధి యను గ్రంథములో ఇట్లున్నది - నిత్య నైమిత్తికాదికర్మలు పాపమును పరిహరించి పుణ్యమును కలిగించి, తద్వారా చిత్తశుద్ధిని కలిగించును. ఇట్టి చిత్తశుద్ధివలన సంసార తత్త్వమును తెలుసుకొన గలుగుచున్నాడు. కావున అతనికి అందుండి నివృత్తి కలుగుచున్నది. ఈ నివృత్తి ఫలితముగా వైరాగ్యము కలుగుచున్నది. వైరాగ్యము మోక్షేచ్ఛను రగుల్కొలుపును. అంతనతడు మోక్షమును సాధించుటకై సాధనలనన్వేషించును. అంత సర్వకామ్య కర్మలను త్యజించుచున్నాడు. ఇదియే సన్న్యాసయోగము. దీనిచే మనస్సు ఆత్మతత్త్వ మందు స్థిరముగా నాటు కొనుటకు అలవాటుపడుచున్నది. అంత

తత్త్వమస్యాది వాక్యమును సులభముగా గ్రహించుచున్నాడు. అజ్ఞానము నశించుచున్నది. అంతమున ఆత్మయందు ప్రతిష్ఠితుడగుచున్నాడు. ఇట్లు పరంపరయా చిత్తశుద్ధి చిత్తైకాగ్ర్యములు మోక్షమునకు కారణమగుటచే వానినే నిత్యనైమిత్తికాదులకు ఉపాసనలకు పరమ ప్రయోజనముగా చెప్పియున్నారు. "వేదపాఠము వలనను యజ్ఞ యాగాదులద్వారాను ఆ ఆత్మతత్త్వమును బ్రాహ్మణులు తెలిసికొనగోరుచున్నారు" అని బృహదారణ్యకోపనిషత్తు చెప్పుచున్నది. మరియు "తపస్సుచేత పాపములను తొలగించుకొనుచున్నారు" అని మనస్మృతి చెప్పుచున్నది.

నిత్యనైమిత్తికయోః ఉపాసనానాం చ అవాంతరఫలం

పితృలోక సత్యలోక ప్రాప్తిః "కర్మణా పితృలోకః

విద్యయా దేవలోకః " (బృ-ఉ-1-5-16) ఇత్యాది శ్రుతేః ॥ **14**

తా॥ నిత్య నైమిత్తికాది కర్మలకు ఈ ఉపాసనలకు కూడ అవాంతర ఫలములు గలవు. ప్రాయశ్చిత్తాదులకు పరలోకమందు ప్రత్యేక ఫలము లేకపోవుట చేత వానిని యిందు చేర్చలేదు. కాని నిత్యనైమిత్తికాదులకైతే చిత్తశుద్ధి చిత్తైకాగ్ర్యమే కాక నిత్యనైమిత్తికాదులకు పితృలోకప్రాప్తియు ఉపాసనలకు బ్రహ్మలోక ప్రాప్తియు అవాంతరఫలములు కూడ కలవని చెప్పియున్నారు. కర్మలచే పితృలోకము, విద్యచే దేవలోకము కలుగునని శ్రుతివాక్యము.

సాధనాని నిత్యానిత్యవస్తువివేకేహాముత్రార్థఫలభోగ

విరాగః శమాదిషట్క సంపత్తి ర్ముముక్షుత్వాని ॥ **15**

తా॥ నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమదమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వము, అను నీ నాలుగున్ను జ్ఞానప్రాప్తి సాధనములగు చతుష్టయ మనబడుచున్నవి.

నిత్యానిత్యవస్తువివేకస్తావత్ బ్రహ్మైవ నిత్యం వస్తు

తతో ऽన్య దఖిలమనిత్యమితి వివేచనం ॥ **16**

తా॥ బ్రహ్మయే నిత్యమైన వస్తువు, బ్రహ్మకంటె యితరమైన సమస్తమును

అనిత్యము అను విచక్షణా జ్ఞానమే నిత్యానిత్యవస్తు వివేకము.

ఐహికానాం స్రక్చందనవనితాది విషయభోగానాం
కర్మజన్యతయానిత్యత్వవదాముష్మి కాణామప్యమృతాది
విషయ భోగానా మనిత్యతయా తేభ్యోనితరాం
విరతిః -ఇహాముత్రార్థ ఫలభోగవిరాగః ॥ 17

తా॥ ఐహికములగు -ఈ లోకమునకు చెందిన స్రక్చందన వనితాది భోగములు ఎంత అనిత్యమో యజ్ఞయాగాది కర్మఫలముగా ప్రాప్తించు ఆముష్మికమైన స్వర్గాది అమృత భోగములుకూడ అంత అనిత్యమే యగును. "క్షీణే పుణ్యేమర్త్యలోకం విశంతి- పుణ్యము క్షీణించగా మర్త్యలోకమును చేరుచున్నారు". అను గీతా వచనముచేతను "తద్యథా ఇహకర్మజితా లోకాః క్షీయతే ఏవమేవ అముత్ర పుణ్యజితా లోకాః క్షీయతే - ఇచట కర్మలద్వారా పొందిన లోకము లెట్లు నశించుచున్నవో అట్లే పరమందు పుణ్యముచే పొందబడిన లోకములుకూడ నశించుచున్నవి" అను శ్రుతిచేతను, ఈ కర్మ ఫలములన్నియు అనిత్యములే యని తేట తెల్లమగుచున్నది. కావున ఇహపర భోగములందు అత్యంతమైన విరక్తియే ఇహాముత్రఫలభోగ విరాగమగుచున్నది.

తృతీయ సాధనయగు శమదమాదిషట్కసంపత్తి ఇట్టి వైరాగ్యము లేక సాధ్యముకాదు.

శమాదయస్తు - శమదమోపరతితితీక్షాసమాధాన శ్రద్ధాఖ్యాః ॥ **18**

తా॥ శమము, దమము,ఉపరతి, తితీక్షా, సమాధానము, శ్రద్ధ అను ఈ ఆరున్నూ శమాదులగుచున్నవి. ఇవిలేక మోక్షేచ్ఛ కలుగుటకు అవకాశము లేదు. ఈ శమాదులను క్రింద వివరించుచున్నాడు.

శమస్తావత్- శ్రవణాది వ్యతిరిక్త విషయేభ్యో మనసో నిగ్రహః ॥ **19**

తా॥ శ్రవణ మనన నిధిధ్యాసలు తప్పించి మిగిలిన సమస్త విషయవాంఛల

నుండి మనస్సును మరలింపజేయుగలుగు చిత్తవృత్తియే శమము.

దమః బాహ్యేంద్రియాణాం తద్వ్యతి రిక్తవిషయేభ్యో నివర్తనం ॥ **20**

తా ॥ పంచజ్ఞానేంద్రియములు పంచకర్మేంద్రియములు బాహ్యమైన దశవిధ ఇంద్రియములువీనిని ఆయా విషయ క్షేత్రములనుండి అంతరింద్రియమగు మనస్సు ద్వారా మరలించి అంతర్ముఖము చేసికొనుట దమము.

ఉపరతిః - నివర్తితానామేతేషాం తద్వ్యతిరిక్తవిషయేభ్య ఉపర
మణ ముపరతిరథవా విహితానాం కర్మణాం విధినాపరిత్యాగః॥ 21

తా'॥ ఇట్లు మరలింపబడిన యింద్రియములను మరల విషయాన్వేషణతో బహిర్ముఖము కాకుండ అంతఃకరణయందే అణచియుంచుట ఉపరతి. ఈ ఉపరతి లక్షణమునకును శమదమాది లక్షణమునకును ఎక్కువ భేదము లేకపోవుటచేత ఉపరతికి మరియొక లక్షణమును చెప్పుచున్నాడు. నిత్య నైమిత్తికాది కర్మలను విధ్యుక్తముగా త్యజించునట్టి సన్యాసము అని అర్థము. విధివత్ అని చెప్పుటచేత సోమరితనముచే త్యజించుట కాదని స్పష్టపరచుచున్నాడు.

తితీక్షా శీతోష్ణాది ద్వంద్వసహిష్ణుతా ॥ **22**

తా॥ శీతోష్ణములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములను సహించేటయు తితీక్ష యగుచున్నది.

"సహనం సర్వదుఃఖానాం అప్రతీకార పూర్వకం ।
చింతావిలాపరహితం సా తితీక్షా నిగద్యతే ॥ (వివేక చూడామణి)

తా ॥ సమస్త దుఃఖములను ప్రతీకార భావము లేకుండను చింతా విలాపములు లేకుండను సహించుటయే తితీక్ష అనబడుచున్నది.

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు పాబోతు సుబ్రమణ్యం (గూడూరు) తన భార్య కీ॥శే॥ సీతారావమ్మ పేరిట ఇచ్చిన నిధి - రూ.100116/- (ఒక లక్షా నూట పదహారు రూపాయలు)

వార్తలు

(01). 1-7-2020వ తేది ఆషాడ శుద్ధ ఏకాదశి సోమవారం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో శ్రీసద్గురు మహర్షి మలయాళస్వాములవారి పుణ్య ఆరాధన సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ఉదయం శ్రీ సద్గురు మూర్తి దివ్యమూర్తికి (శ్వేతశిలామూర్తికి) అభిషేకం, అర్చన జరిగినది. ఆశ్రమ వాసులందరు పరిసర భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. మధ్యాహ్నం అందరికి భిక్ష చేయబడినది.

(02). 5-7-2020 తేది ఆషాఢ పూర్ణిమ - గురుపూర్ణిమ సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో అధిష్ఠాన మందిరంలో శ్రీగురుమూర్తి శ్రీశ్రీశ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి మూర్తికి, పాదుకలకు అభిషేకార్చనాదులు, చేయబడినవి. పూజ్యశ్రీ ఆశ్రమ పీఠాధిపతి స్వాముల వారిచే అందరికి తీర్థప్రసాదాలు ఇవ్వబడినవి.మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగినది.

(03). 5-7-2020 తేది ఆశ్రమంలో చాతుర్మాస్యవ్రతం ప్రారంభింపబడినది. ఈ సందర్భంగా ప్రతిరోజు, గీత, ఉపనిషత్ పారాయణం ఉదయం, సాయంకాలం ఆధ్యాత్మిక ప్రవచనలు, జప ధ్యానములు జరుగుచున్నవి. ప్రతిరోజు పూజ్యశ్రీ స్వాములవారి ప్రసంగాలు, పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారి ప్రవచనాలు జరుగుచున్నవి.

(04). కరోనా తీవ్రత వలన ఆశ్రమ కంటి ఆసుపత్రి జూలై నెలంతా మూసివేయబడినది.

(05).(ఎ). 16-7-2020 తేది శుక్రవారం కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామిమూర్తికి ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన చేయబడినవి.

(బి).19-7-2020 తేది ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని నర్మదేశ్వరమహాదేవ శివలింగానికి ప్రదోషకాలంలో రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి రచనలు చదవండి, చదివించండి.

		రూ.
1.	గీతామకరందము (తెలుగు)	400.00
2.	గీతామకరందము (ఇంగ్లీషు)	450.00
3.	యోగవాశిష్ఠ రత్నాకరము	300.00
4.	రామాయణ రత్నాకరము	300.00
5.	భాగవతరత్నాకరము	300.00
6.	భారతరత్నాకరము	300.00
7.	ఉపనిషద్రత్నాకరము	150.00
8.	మోక్షసాధనరహస్యము	100.00
9.	The Secret of Liberation	200.00
10.	గీతోపన్యాసములు	120.00
11.	Lecturers on Geetha	200.00
12.	బ్రహ్మచర్యవిజయము	60.00
13.	బ్రహ్మానంద వైభవము	30.00
14.	ఆత్మానుసంధానము	50.00
15.	అమృతబిందువు	60.00
16.	స్థూలాక్షరి తాత్పర్యగీత	70.00
17.	పరమార్థ కథలు	120.00
18.	స్వాములవారి జీవిత చరిత్ర	100.00
19.	ఉపనిషత్ కథలు	40.00

గ్రంథములు కావలసిన వారు పైకనిన ప్రకారము వీటి ధరలను ఎం.ఓ. ద్వారాగానీ, చెక్కు ద్వారా గాని, శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శ్రీశుకబ్రహ్మాశ్రమము పోస్టు, శ్రీకాళహస్తి -517 640 అను చిరునామాకు పంపగలరు.

Regd.No. TRP / 123 / 2018 - 20 August 2020 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-07-2020, Permitted to post : 29th, 30th every month.

ఈ పేజి స్థల దాతలు
సుభద్రా చారిటబుల్ ట్రస్టు
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం